బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 15 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**




ఆధార్ అప్డేట్ పై యూఐడీఏఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఉచితంగా ఆధార్ వివరాలను అప్డేట్ చేసుకునేందుకు మరో అవకాశం కల్పించింది. ఈ మేరకు ఉడాయ్ ఎక్స్ లో ట్వీట్ చేసింది. 2024 డిసెంబర్ 14 వరకు ఆధార్ ఫ్రీ అప్డేట్ గడువు పెంచుతున్నట్లు వెల్లడించింది. దీంతో ఆధార్ కార్డులో మార్పు చేర్పులు చేసుకోవాలనుకొనేవారు ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్డేట్ చేసుకోవచ్చు. యూఐడీఏఐ నిబంధనల మేరకు ప్రతి 10 ఏళ్లకు ఒకసారి ఆధార్ ను అప్డేట్ చేసుకోవాలి. ఇందుకోసం వ్యక్తి తన గుర్తింపు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. 'మై ఆధార్' పోర్టల్ లో ఉచితంగా ఈ సేవలు పొందవచ్చు. ఆధార్ లోని పేరు, పుట్టినతేదీ, చిరునామా, అడ్రస్ వంటి మార్పు చేర్పులు చేసుకోవచ్చు. ఉచిత గడువు ముగిస్తే ఆధార్ కేంద్రాల్లో రూ.50 చెల్లించి అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

### వ్యవసాయ మోటార్లకు
# సోలార్ పంపుసెట్లు



- ప్రయోగాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా 30 నుంచి 40 గ్రామాల్లో చేపట్టబోతున్నాం.
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం. వ్యవసాయ మోటార్లకు సోలార్ పంపుసెట్లు పెట్టబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో సుమారు 85 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి తదనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిందని అన్నారు. ప్రజల లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలుగా మార్చుకున్నామని చెప్పారు. ప్రజా ఆకాంక్షలను చట్టాలుగా మార్చాం. 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేశాం. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రుణమాఫీ చేశాం. అర్హత ఉన్న ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం. రుణమాఫీ అంశంలో వెనకడుగు వేయం. పంటల బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు.

వ్యవసాయ మోటార్లకు సోలార్ పంపుసెట్లు పెట్టబోతున్నామని తెలిపారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా 30 నుంచి 40 గ్రామాల్లో చేపట్టబోతున్నాం. సోలార్ పవర్‌తో రైతులకు ఉచితంగా విద్యుత్ పొందడమే కాకుండా ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఖర్చుతో ఇళ్లకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు విదేశాలకు వెళ్లి పరిశ్రమల ఏర్పాటు కోసం రూ.36 వేల కోట్ల ఎంవోయూలు చేసుకున్నారు" అని తెలిపారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని తెలిపారు.. సాంకేతిక సమస్యలతో కొందరికి రుణమాఫీ కాలేదని అన్నారు. రూ. లక్ష రుణమాఫీ చేసేందుకు గత ప్రభుత్వం ఐదేళ్ల సమయం తీసుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేసినట్లు గుర్తు చేశారు. గురువారం ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఘర్షణ పడిన విషయాన్ని గుర్తు చేస్తూ.. దానిని కాంగ్రెస్‌కు అంటగడుతున్నారని మండిపడ్డారు.

### గీత, బైబిల్, ఖురాన్ సారాంశం
# ప్రపంచ శాంతి మాత్రమే



- అభివృద్ధి విషయంలో అందరితో కలిసి పని చేస్తాం
- ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పేదల గురించి మాట్లాడతారు
- మూసీ, ఈసా నదుల ప్రక్షాళన పనుల్లో స్థానిక ఎంఐఎం సహకారం తీసుకుం టున్నాం
- కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండో సారి అవకాశం వస్తుంది
- "ప్రాఫెట్ ఫర్ ది వరల్డ్" పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

"గీత, బైబిల్, ఖురాన్ సారాంశం ప్రపంచ శాంతి మాత్రమే. కలిసికట్టుగా దేశాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్ని మత గ్రంథాలు చెబుతున్నాయి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రస్తుత అధ్యక్షుడు, ప్రముఖ ఇస్లాం పండితుడు, రచయిత మౌలానా ఖలీద్ సైఫుల్లా రహ్మాని రచించిన "ప్రాఫెట్ ఫర్ ది వరల్డ్" పుస్తకాన్ని ముఖ్యమంత్రి శనివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శాంతి, కరుణ, సోదరభావాన్ని చాటి చెప్పే ముహమ్మద్ ప్రవక్త బోధనలు యావత్ మానవాళికి దిక్సూచి లాంటివని అన్నారు. ప్రవక్త బోధనలైనా, భగవద్గీత, బైబిల్ సారాంశాలైనా మనకు చెప్పేది మంచి విషయాలే అని, విద్వేషాలు వదిలి శాంతియుతంగా జీవించడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ముహమ్మద్ ప్రవక్త బోధనలపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు. విద్వేష భావనల నుంచి దేశాన్ని, పోరాడి సాధించుకున్న స్వేచ్ఛను కాపాడుకోవాలంటే ప్రవక్త చెప్పిన శాంతి మార్గమే ఆచరణీయమని పేర్కొన్నారు.

రాజకీయాలు, ఎన్నికల్లో పరస్పరం తలపడినా, అభివృద్ధి విషయంలో మాత్రం అందరితో కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. "గతంలో హైదరాబాద్‌లో ఒక వైపు ఓవైసీ, మరో వైపు నేను ఎంపీగా ఉన్నాం. అసదుద్దీన్ ఓవైసీ కొన్ని సార్లు కాంగ్రెస్‌పై కూడా విమర్శలు చేసేవారు. మంచి ప్రభుత్వాన్ని నడపాలంటే మంచి ప్రతిపక్షం కూడా ఉండాలి. పార్లమెంట్‌లో పేదల తరపున మాట్లాడే నేతలు తగ్గిపోయారు. తెలంగాణలోని 17 మంది ఎంపీల్లో ఒక్క అసద్ మాత్రమే పేదల గురించి మాట్లాడుతున్నారు' అని ప్రశంసించారు. 'ఎన్నికలు ముగిసే వరకే రాజకీయాలు.. ఆ తరువాత నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల కోసం అంతా కలిసి పనిచేయాలి. మజ్లిస్ పార్టీ నుంచి వచ్చే సలహాలు, సూచనలను స్వీకరిస్తున్నాం'

మిగితా 2వ పేజీలో

## జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం చివరి శ్వాస తీసుకుంటోంది



- ప్రధాని మోడీ
- జమ్ము కశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఎన్నికల ప్రచారం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం చివరి శ్వాస తీసుకుంటోందని ప్రధాని మోడీ అన్నారు. జమ్ముకశ్మీర్ లాంటి అందమైన ప్రాంతాన్ని వారసత్వ రాజకీయాలు దెబ్బతీశాయని విమర్శించారు. అందుకే పరివారవాదుల రాజకీయాలను ఎదుర్కోవడానికి తమ ప్రభుత్వం కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించిందని తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో అప్రకటిత కర్ఫ్యూలు ఉండవని, ఆ రోజులు ముగిశాయని చెప్పుకొచ్చారు. జమ్ముకశ్మీర్‌లోని దోడా జిల్లాలో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రధాని మోడీ శనివారం ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమ్ముకశ్మీర్ విదేశీ శక్తుల లక్ష్యంగా మారిందని ఎద్దేవా చేశారు. ఆ తర్వాత పరివారవాదులు ఈ ప్రాంతాన్ని వంచన చేయడం ప్రారంభించారని విమర్శించారు. గతంలో జమ్ముకశ్మీర్‌లో పరివారవాదులు తమ పిల్లలను ప్రాజెక్ట్ చేసి కొత్త నాయకత్వాన్ని ఎదగనివ్వలేదని ఆరోపించారు. అందుకే తాము కేంద్రంలో 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే యువ నాయకత్వాన్ని ఏర్పాటు చేయడంపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

"త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు జమ్ముకశ్మీర్ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. మీరు విశ్వసించిన రాజకీయ పార్టీలు మీ పిల్లల భవిష్యత్తును పట్టించుకోలేదు. వారు వారి వారసుల భవిష్యత్తుపైనే దృష్టి పెట్టాయి. జమ్ముకశ్మీర్ యువత ఉగ్రవాదంతో బాధపడింది. ఈ వారసత్వ పార్టీలు మిమ్మల్ని తప్పుదోవ పట్టించి, వేడుక చూశాయి. జమ్ముకశ్మీర్ ప్రస్తుతం రాళ్లదాడులు లేవు. గతంలో ఉగ్రమూకలు విసిరిన రాళ్ల కొత్త జమ్ముకశ్మీర్?ను సృష్టించడానికి ఉపయోగించాం." అని అన్నారు.

"దాదాపు 2000 సంవత్సరం నుంచి జమ్ముకశ్మీర్ లో పంచాయతీ ఎన్నికలు జరగలేదు. కొత్త నేతలకు అవకాశం రాలేదు. అందుకే కొత్త నాయకత్వాన్ని మీ ముందుకు తీసుకురావాలని నేను ప్రయత్నించాను. తర్వాత వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయికి చేర్చడమే ఈ ఎన్నికల అసలు లక్ష్యం. జమ్ముకశ్మీర్ లో అప్రకటిత కర్ఫ్యూలు గతంలో ఉండేవి. లాల్ చౌక్ వద్దకు వెళ్లాలంటే భయపడేవారు ప్రజలు. కాంగ్రెస్ హయాంలో కేంద్రంలో హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తి కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితి. ఆ రోజులు ముగిశాయి." అని ప్రధాని మోదీ ఎన్నికల ర్యాలీలో వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్‌కు దమ్ముంటే ఉప ఎన్నికలకు రావాలి

- హైకోర్టు తీర్పు తర్వాత కాంగ్రెస్‌లో భయం మొదలైంది.
- పోలీసుల అండతో ఎమ్మెల్యే ఇంటిపై దాడి
- పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇప్పటికైనా ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలి
- గ్యారెంటీలు అమలు చేయాలని అడిగితే ఇలాంటి హైడ్రామాలు చేస్తున్నారు.
- అధికారం ఎవరికి శాశ్వతం కాదు.
- దాడి జరిగినప్పుడు విధుల్లో విఫలం అయిన పోలీసులను సస్పెండ్ చేయాలి
- హైదరాబాద్‌లో ఉన్న ప్రజలందరూ మా వారే
- బీఆర్ఎస్‌కు హైదరాబాద్ ప్రజలు అండగా నిలిచారని, రేవంత్ కక్ష సాధింపు చర్యలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్‌కు దమ్ముంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. హామీలు అమలు చేయాలని కోరితే దాడులు చేస్తున్నారని అన్నారు. హైడ్రా అని హైడ్రామాలు చేశారని విమర్శించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దుష్ట సంప్రదాయాలకు తెరలేపుతున్నారని, అవి ఆయన మెడకే చుట్టుకుంటాయని చెప్పారు. ఎన్ని డైవర్షన్‌లు చేసినా హామీల గురించి ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కొండాపూర్‌లోని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన కేటీఆర్.. ఎమ్మెల్యేను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే దాడులు చేస్తున్నారన్నారు. కౌశిక్ రెడ్డి ఏం తప్పు మాట్లాడారని ప్రశ్నించారు. పార్టీ మారిన వారు దమ్ముంటే రాజీనామా చేయాలని కోరారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలన్నారు. 'ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా ఉంది. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి ఉరి తీయాలన్నారు.. రాళ్లతో కొట్టాలన్నారు. ఇప్పుడు ఆయనే స్వయంగా కండువాలు కప్పుతున్నారు. పది మంది పోయారు.. ఎవరూ మిగలరని ప్రకటనలు చేస్తున్నారు. పార్టీ మారానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బహిరంగా ప్రకటించారు. ఆయనకే పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చారు. అరికెపూడి గాంధీ ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని కోరితే దాడిచేశారు. పోలీసు ఎస్కార్టు పెట్టి మరీ ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయించారు. 20 బండ్లు పెట్టుకొని దాడికి వస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నది?. కౌశిక్ రెడ్డి కుటుంబానికి ఏదైనా జరిగి ఉంటే బాధ్యత ఎవరిది?. చేతగాని సీఎం, హోం మంత్రి ఉండటం వల్లే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేశారు. అసలు హోం మంత్రి ఎక్కడున్నారో ఎవరికీ తెలియదు. హైదరాబాద్‌లో కనీసం శాంతి భద్రతలు అదుపులో ఉంచలేకపోతున్నారు. హైకోర్టు తీర్పు తర్వాత మళ్లీ రూట్ మార్చారు.' అని కేటీఆర్ అన్నారు.

అరికెపూడి గాంధీ ఏ పార్టీలో ఉన్నాడో చెప్పాలన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలంతా ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌కు పోరాటాలు కొత్తేమీ కాదన్నారు. అధికారం ఎవరికీ కొత్తకాదని చెప్పారు. పార్టీ మారిన పది మందిపై వేటు వేయాల్సిందేనన్నారు. కౌశిక్ ఇంటిపై దాడికి సహకరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ని దాడులు చేసినా ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిలుస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే ప్రజలు ఎదురు తిరిగారని చెప్పారు. ఈ హింసాయుతమైన పద్ధతులు గత పదేండ్లలో ఎక్కడా జరుగలేదని వెల్లడించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో డైవర్షన్ గేమ్‌లు కొనసాగుతున్నాయని తెలిపారు. వాటికి ప్రజలే సరైన సమాధానం ఇస్తారన్నారు. హైదరాబాద్ ప్రజలపై రేవంత్ పగబట్టాడని విమర్శించారు. ఒక్క సీటు

మిగితా 2వ పేజీలో

### ఢిల్లీ ఎయిమ్స్‌కు
# ఏచూరి మృతదేహం అప్పగింత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అంతిమయాత్ర ముగిసింది. ఆయన పార్థివదేహాన్ని పరిశోధనల కోసం కుటుంబ సభ్యులు ఢిల్లీ ఎయిమ్స్‌కు అప్పగించారు. సీతారామ్ ఏచూరి కోరిక మేరకు ఆయన కుటుంబసభ్యులు ఏచూరి భౌతిక కాయాన్ని మెడికల్ రీసెర్చ్ కోసం ఎయిమ్స్ ఆస్పత్రికి దానం చేసిన విషయం తెలిసిందే.

శనివారం ఉదయం సీతారాం ఏచూరి భౌతిక కాయాన్ని అభిమానుల సందర్శనార్థం ఢిల్లీలోని సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం ఏకేజీ భవన్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల వరకూ అక్కడే ఉంచారు. ఆ తర్వాత పార్టీ కార్యాలయం నుంచి కమ్యూనిస్టు శ్రేణులు ర్యాలీగా ఆయన భౌతిక కాయాన్ని అంతిమ యాత్రగా న్యూఢిల్లీలోని ఎయిమ్స్ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా 'లాల్‌సలామ్ కామ్రేడ్' నినాదాలు హోరెత్తాయి. గత కొన్ని రోజులుగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న సీతారాం ఏచూరి చికిత్స పొందుతూ ఈ నెల 12న తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే.


## ఆర్జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ అరెస్ట్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రి జూనియర్ వైద్యురాలి హత్యాచారం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆర్‌జీ కర్ మాజీ ప్రిన్సిపల్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. మరో పోలీసు అధికారిని కూడా అరెస్టు చేసినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన కేసులో ఇప్పటికే సందీప్ ఘోష్‌ను సీబీఐ అరెస్టు చేసింది. తాజాగా డాక్టర్ లైంగికదాడి కేసులో సందీప్ అరెస్ట్ అయ్యారు.

సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి అభిజిత్ మండల్‌లను సీబీఐ అరెస్టు చేయడంపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత సుకాంత మజుందార్ స్పందించారు. "ఈ రోజు చేసిన అరెస్టులు చాలా ముఖ్యమైనవి. ముఖ్యంగా తాలా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి అరెస్టు. లైంగికదాడి కేసులో అవకతవకలకు పాల్పడ్డాడనే ఆరోపణలపై అరెస్టయ్యారు. వాళ్లను అరెస్టు చేయాలని బెంగాల్ ప్రజలు మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. నా ప్రశ్న ఏమిటంటే, ఒక చిన్న స్టేషన్ ఇన్‌చార్జి అలాంటి నిర్ణయం తీసుకోగలడా? ఇక బెంగాల్ ప్రజలు ముఖ్యమంత్రిని ఆ పదవి నుంచి తొలగిస్తారు" అని సుకాంత మజుందార్ అన్నారు.



## హైడ్రాకు త్వరలో చట్ట బద్ధత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబర్ లోపు ఆర్డినెన్స్ రాబోతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. చాలా మంది హైడ్రాపై అనేక అనుమానాలు లేవనెత్తున్నారని, కొంతమంది కోర్టులను సైతం ఆశ్రయించారని.. అలాంటి వారికి త్వరలోనే సమాధానం దొరుకుతుందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన క్రెడాయ్ సమావేశంలో కమిషనర్ రంగనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

మిగితా 2వ పేజీలో

# తెలంగాణ పామ్ ఆయిల్ రైతులకు గుడ్‌న్యూస్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలోని పామాయిల్ రైతులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి మేరకు ముడి పామాయిల్ దిగుమతిపై 5.5 నుంచి 27.5 పన్ను శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో గెలల ధర రూ. 1500 నుంచి రూ. 1700 వరకు పెరిగితే టన్ను రూ. 16,500 దాటే అవకాశం ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 44,400 ఎకరాల్లో పామాయిల్ తోటల నుంచి 2.80 లక్షల టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి వస్తుందన్నారు. ఈ దిగుమతి సుంకం పెంపుతో 9366 మంది ఆయిల్ పామ్ రైతులకు అదనంగా లబ్ధి చేకూరనుందని వివరించారు. పామాయిల్ దిగుమతిపై కేంద్రానికి ఏడాదికి రూ. 80 వేల కోట్లు విదేశీ మారక ద్రవ్యం ఖర్చవుతుందన్నారు. అయితే, దిగుమతి సుంకాలు విధించడంతో దేశం, తెలంగాణలోని పామాయిల్ రైతులు లాభపడతారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## డ్రాగన్ కంపెనీల్లో సెబీ చీఫ్ పెట్టుబడులు..

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పవన్ ఖేరా



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సెబీ చైర్ పర్సన్ మాధాభి పురీ బుచ్‌పై కాంగ్రెస్ పార్టీ నేత పవన్ ఖేరా సంచలన ఆరోపణలు చేశారు. సెబీ చైర్ పర్సన్ హోదాలో ఉంటూనే పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారని ఆరోపించారు. గతంలో వచ్చిన ఆరోపణలకు మాధాబి పురీ బుచ్, ఆమె భర్త శుక్రవారం సుదీర్ఘ వివరణ ఇచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ నేత పవన్ ఖేరా తాజాగా ఆరోపణలు గుప్పించారు. సెబీలో ఉంటూనే 2017–23 మధ్య లిస్టెడ్ సెక్యూరిటీల్లో రూ.36.9 కోట్లు ట్రేడింగ్ చేశారని పవన్ ఖేరా చెప్పారు. 2018–19లో భారీ మొత్తంలో ట్రేడింగ్ నిర్వహించారన్నారు.చైనాతోపాటు పలు విదేశీ ఫండ్స్ లోనూ ఆమె పెట్టుబడులు పెట్టారని పవన్ ఖేరా చెప్పారు. నాలుగు అంతర్జాతీయ ఫండ్స్ లో ఆమె పెట్టుబడులు ఉన్నాయని గుర్తు చేశారు. అందులో చైనాకు చెందిన గ్లోబల్ ఎక్స్ ఎంఎస్సీఐ చైనా కన్జ్యూమర్, ఇన్వెస్కో చైనా టెక్నాలజీ ఈటీఎఫ్ ల్లో పెట్టుబడులు ఉన్నాయని చెప్పారు. ఈ పెట్టుబడుల విషయమై ఆమె ఎప్పుడు ప్రకటన చేశారని ప్రశ్నించారు. ఈ సంగతి ప్రభుత్వ నియంత్రణ సంస్థలకు తెలుసా? అని నిలదీశారు. సెబీ చైర్పర్సన్ మాధాబీ పురీ బుచ్ ఇచ్చిన వివరణను కొట్టి పారేశారు. ఐసీఐసీఐ, మహీంద్రా గ్రూప్ విషయంలో ఆమె వివరణ ఏమాత్రం సరిపోదని స్పష్టం చేశారు.

## గీత, బైబిల్, ఖురాన్ సారాంశం

# ప్రపంచ శాంతి మాత్రమే

(మొదటి పేజీ తరువాయి)

మూసీ, ఈసా నదుల ప్రక్షాళన పనుల్లో స్థానిక ఎంఐఎం పార్టీ సహకారం తీసుకుం టున్నామని గుర్తుచేశారు. కులమతాలకు అతీతంగా పేదల సంక్షేమం, అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను ఇవ్వనున్నాం. కలిసిమెలిసి ప్రభుత్వాన్ని ముందుకు తీసుకుపోతాం. గతంలో చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు ప్రభుత్వాలను రెండుసార్లు గెలిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా రెండోసారి అవకాశం వస్తుందని నమ్ముతున్న. ఈ పదేళ్ల పాటు పేదల సంక్షేమం కోసం పనిచేస్తాం' అని రేవంత్ తెలిపారు. రాబోయే 10 సంవత్సరాలు ప్రజా ప్రభుత్వానికి అన్ని వర్గాలు అండగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ ఆకాంక్షించారు.

ఆరాంఘర్ లోని మెట్రో కన్వెన్షన్ లో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎంతో పాటు ప్రభుత్వ సలహాదారు ముహమ్మద్ అలీ షబ్బీర్ గారు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ గారు, టీఎంఆర్ఐఈఎస్ చైర్మన్ ఫహీం ఖురేషి, పలువులు ముస్లిం పండితులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు దమ్ముంటే ఉప ఎన్నికలకు రావాలి



(మొదటి పేజీ తరువాయి)

కూడా కాంగ్రెస్‌కు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఈర్ష్య అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు.

పేద ప్రజల కడుపు కొట్టడానికి ముఖ్యమంత్రి అయ్యావా..? అని కేటీఆర్ ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ నగర్‌లో కొద్ది రోజుల క్రితం పేదలు, దివ్యాంగులకు చెందిన 75 ఇండ్లను రేవంత్ సర్కార్ నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేటీఆర్ మాట్లాడారు. పేదవాళ్లు అనే సోయి లేకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా.. ఈ ఏడాది ఆగస్టు 29న తెల్లవారుజామున 3 గంటలకు 75 ఇండ్లను నేలమట్టం చేశావు. దివ్యాంగులనే ఇంకితజ్ఞానం లేకుండా వారి నివాసాలపైకి బుల్డోజర్లను పంపి ఇండ్లను కూల్చేశావు. పాలమూరు బిడ్డల ఆశీర్వాదంతోనే సీఎం అయ్యాను.. నేను పాలమూరు బిడ్డను అని పదేపదే చెబుతావు. మరి పేద ప్రజల కడుపు కొట్టడానికి సీఎం అయ్యావా..? అసలు దివ్యాంగుల ఇండ్లను ఎందుకు కూలగొట్టాల్సి వచ్చిందో ఒక్క కారణం చెప్పగలరా..? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు.

గవర్నమెంట్ జాగాలో ఇల్లు కట్టుకుంటే.. అలాంటి స్థలాలకు చిత్తశుద్ధితో కేసీఆర్ ప్రభుత్వం 58, 59 జీవో కింద రెగ్యులరైజ్ చేశాం. పేదవాళ్లకు లక్షల పట్టాలు అందజేశాం. జీవో 59 కింద 120 గజాల స్థలం కంటే ఎక్కువ ఉంటే.. నామమాత్రపు ఫీజుతో రెగ్యులరైజ్ చేశాం. మీరేమో దివ్యాంగులను రోడ్డు మీద పడేసి.. వాళ్ల గోస పుచ్చుకున్నారు. ఆ పేదలకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పది రోజుల పాటు అండగా ఉన్నారు. వాళ్లను శిబిరానికి తరలించి ఆదుకునే ప్రయత్నం చేశారు. రేవంత్ రెడ్డి నీకు సంస్కారం ఉంటే, పేదల పట్ల ప్రేమ ఉంటే.. వెంటనే ఆ 75 మందికి డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించు. ఏ అధికారులైతే అక్రమంగా, అన్యాయంగా దివ్యాంగులను రోడ్ల మీద పడేశారో వారిపై చర్య తీసుకో. గతంలో నీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పట్టాను చిత్తు కాగితలం చూసి, విలువ ఇవ్వని అధికారులపై చర్య తీసుకో.. వారిని సస్పెండ్ చేస్తావో, సర్వీసు నుంచి తొలగిస్తావో.. దమ్ముంటే ఏదో ఒక నిర్ణయం తీసుకో అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**పాలమూరు ఎత్తిపోతల పూర్తి చేస్తే.. కేసీఆర్‌కు పేరొస్తుందని రేవంత్ రెడ్డికి భయం**

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం 95 శాతం పూర్తి చేసిందని కేటీఆర్ తెలిపారు. మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని, అందుకే ఆ పనులు నిలిపివేశాడని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. వలసల జిల్లాగా పేరుపడ్డ పాలమూరును పచ్చగా చేయాలని చెప్పి పెండింగ్ ప్రాజెక్టులను శరవేగంగా రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కేసీఆర్ 8 లక్షల ఎకరాలకు నీళ్లు అందించారు. పాలమూరు జిల్లా శాశ్వతంగా ధాన్య భాండాగారంగా కావాలన్న ఉద్దేశంతో పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును తీసుకున్నాం. కరివెన, ఉద్ధండపూర్, ఏదుల, వట్టెం, నార్లపూర్ రిజర్వాయర్లు పూర్తయ్యాయి. పూర్తి కావడమే కాకుండా కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నార్లాపూర్ వద్ద ఒక పంపు ఆన్ చేసి నీళ్లు వదిలారు. 95 శాతం పని పూర్తయింది. అక్కడక్కడ కాల్వల కోసం భూసేకరణ పని చేయాలి రేవంత్ రెడ్డి. కాల్వల భూసేకరణ కోసం ఆ టెండర్ మనమే పిలిచాం.. కానీ వీరు రద్దు చేశారు. కొల్లాపూర్ నుంచి జడ్చర్ల వరకు అన్ని పనులు పూర్తయ్యాయి. మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేస్తే నీళ్లు వస్తాయి. నీళ్ల కోసం ఆశతో ప్రజలు ఉన్నారు. 95 శాతం పనులు పూర్తయిన పాలమూరు ఎత్తిపోతలను రేవంత్ రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదు..? ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే భయం ఉందా..? ప్రతి నీటి చుక్కలో కేసీఆర్‌ను చూసుకుంటారని భయపడుతున్నావా..? నీ బాధ.. భయం ఏంది..? పదేపదే పాలమూరు బిడ్డను అని చెప్పుకునే నీకు పాలమూరు మీద ఎందుకు ప్రేమ లేదని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు.

**దొంగలు.. దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్టు..**

నిజంగా నీవు పాలమూరు బిడ్డవు అయితే దీనికి సమాధానం చెప్పు. హైదరాబాద్ నగరానికి తాగు నీరందించే సుంకిశాల ప్రాజెక్టు వద్ద ప్రమాదం జరిగింది. ఆ ప్రాజెక్టు పనులు చేపట్టిన మేఘా ఇంజినీరింగ్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ప్రతిపక్షంగా డిమాండ్ చేశాం. విచారణ చేయించండి.. ఒక్క వర్క్ కూడా ఇవ్వొద్దు అని చెప్పాం. అధికారుల మీద చర్యలు తీసుకుని వారిని బలి పశువులను చేయకండి అని కూడా చెప్పాం. ఇప్పటి వరకు మేఘా ఇంజినీరింగ్ మీద చర్య తీసుకోలేదు. ఇక నెల రోజుల కింద ఒక మాట చెప్పాను. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మేఘాకు కట్టబెడుతారని.. ఈ రోజు పొద్దున అదే వార్తలు వచ్చాయి.. దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్టు.. రూ. 4350 కోట్ల ప్రాజెక్టును రూ. 80 కోట్ల నష్టం చేసినా మేఘా ఇంజినీరింగ్‌కు కట్టబెట్టారు. రూ. 4350 కోట్ల కాంట్రాక్ట్‌లో సగం మేఘా ఇంజినీరింగ్‌కు, మరో సగం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పజెప్పారు. మరి గతంలో ఆంధ్రా కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు ఇస్తున్నారని మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు చెంపలు వేసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. మేఘాను ఈస్ట్ ఇండియా కంపెనీ అని తిట్టి.. నేడు అదే సంస్థకు కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కట్టబెట్టడం దారుణం. నీ రంగు, నీ నైజం బయటపడింది. ఈ ఆశించి చేస్తున్నావు అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు.

**పాలమూరు ఎత్తిపోతల పర్యటనకు బయల్దేరుతాం..**

కేసీఆర్ అనుమతితో.. మేడిగడ్డను సందర్శించినట్టే.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులమంతా.. పాలమూరు ఎత్తిపోతల పర్యటనకు బయల్దేరుతాం. పాలమూరు ప్రజలకు వాస్తవాలను వివరిస్తాం. పాలమూరు బిడ్డలకు చేతులు జోడించి నమస్కరిస్తున్నా.. నీళ్లు వస్తాయనే ఆశతో రైతులు తమ భూములను ఇచ్చారు. ఇప్పుడు పనులు పూర్తైన కూడా నీళ్లు ఇవ్వడం లేదు. త్వరలోనే పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శిస్తాం. రెండు రోజుల పాటు పర్యటించి ప్రతి పంప్ హౌస్‌ను ప్రజలకు చూపిస్తాం. గత 9 నెలలుగా ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం తొక్కి పెడుతోంది.. నీళ్లు రాకుండా చేస్తుంది అని కేటీఆర్ మండిపడ్డారు

## 20న క్యాబినెట్ సమావేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఈ నెల 20న క్యాబినెట్ సమావేశం జరుగనున్నది. సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు.కొత్త రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, హైడ్రాకు మరిన్ని అధికారాలు, రూ.2 లక్షలపైన రుణమాఫీకి సంబంధించి విధి విధానాలు తదితర అంశాలపై చర్చించే అవకాశమున్నది.

## నోటీసులిచ్చి దర్యాప్తు చేయండి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

చెరువుల ఆక్రమణలకు సహకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చి, వివరణ తీసుకున్న తర్వాతే చట్టానికి అనుగుణంగా దర్యాప్తు చేపట్టాలని సైబరాబాద్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆక్రమణలను ప్రోత్సహించారని ఆరోపిస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఉద్యోగులపై గత నెల 30న సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని మేడ్చల్ మలాజిగిరి సర్వే డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, మరో ఉద్యోగి పూల్‌సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ సుజన విచారణ జరిపారు.పిటిషనర్లపై నమోదైన అభియోగాలన్నీ ఏడేండ్లలోపు శిక్ష పడేవైనందున వారికి బీఎన్ఎస్ఎస్‌లోని 35(3) సెక్షన్ కింద నోటీసులు జారీచేసి, వివరణ తీసుకోవాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితుల ఆధారాలను పరిగణనలోకి తీసుకుని, మెజిస్ట్రేట్‌కు సమర్పించే తుది నివేదికకు జత చేయాలని ఆదేశిస్తూ.. పిటిషన్లపై విచారణ ముగిసినట్టు ప్రకటించింది.

## గురుకుల పాఠశాలల్లో గల్ఫ్ కార్మికుల పిల్లల అడ్మిషన్లు

- మంత్రి పొన్నం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన గల్ఫ్ కార్మికులు అధికంగా ఉండే నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టీపీసీసీ ఎన్నారై సెల్ వినోద్ పాల్గొని గల్ఫ్ బాధితులకు సంబంధించిన 5 అంశాలపై చర్చించారు.

పథానంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలని.. అందులో గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు సభ్యులుగా నియమించి.. ఇందుకోసం జీవో విడుదల చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఈనెల 20 నుంచి గల్ఫ్ కోసం ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తామని తెలిపారు. గురుకుల పాఠశాల, కళాశాలల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు 100 శాతం అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు పలు సలహాలు సూచనలు చేశారు. ఏజెన్సీల పేరుతో మోసం జరుగుతుందని.. అలా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని.. ఇప్పటికే తన వేములవాడ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు కార్మికులు గల్ఫ్‌లో మృతి చెందగా వారి కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ నుంచి పరిహారం అందిచ్చినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రైతు భీమా మాదిరిగానే గల్ఫ్ భీమా ఉండాలని సూచించారు.

గల్ఫ్ కార్మికులు చనిపోతే మృతదేహం రావడానికి వారం రోజులకు పైగా సమయం పడుతుందని.. 48 గంటల్లో ఇక్కడికి వచ్చేలా చూడాలని తెలిపారు. దేశంలో బెస్ట్ గల్ఫ్ పాలసీ కేరళ రాష్ట్రంలో ఉందని అక్కడ ఉన్న దానిని స్టడీ చేయాలని సూచించారు. కేరళలో జీడీపీ ప్రధానంగా గల్ఫ్ కార్మికుల ద్వారా వస్తోందని తెలంగాణ రాష్ట్రంలో కూడా జీడీపీ గల్ఫ్ కార్మికుల ద్వారా అభివృద్ధి జరగాలని సూచించారు.

## ఏరియాల జీఎంల సింగరేణి చైర్మన్ సమావేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని థర్మల్ పవర్ స్టేషన్లకు బొగ్గు కొరత లేకుండా బొగ్గును సరఫరా చేయాలని, ఇందుకోసం రోజుకు కనీసం రెండు లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి అంతే మొత్తంలో రవాణా చేయాలని సింగరేణి చైర్మన్, ఎండీ ఎన్.బలరాం అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు. శనివారం ఆయన అన్ని ఏరియాల జీఎంలతో వీడియో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఏరియా ఉత్పత్తిని ఆయన సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో నిలిచిన నీటిని తక్షణమే తొలగించాలని, అవసరమైతే అదనపు పంపులను వినియోగించి బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రోజుకు కనీసం 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని కోరారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు సరిపడా బొగ్గును అందించాల్సిన బాధ్యత సింగరేణి కంపెనీపై ఉందని, ఉద్యోగులు, అధికారులు దీనిని దృష్టిలో ఉంచుకుని అంకితభావంతో పనిచేసి రక్షణతో ఉత్పత్తులు సాధించాలని పిలుపునిచ్చారు. గత మూడు నెలల్లో వర్షాల కారణంగా నష్టపోయిన ఉత్పత్తి నష్టాన్ని భర్తీ చేసేందుకు కృషి చేయాలన్నారు.

అలాగే కొత్తగూడెంలో వి.కె.ఓ.సి. మొదటి దశ అటవీ అనుమతులు లభించినందున, వచ్చే రెండు నెలల్లో ఉత్పత్తి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏరియాల్లో జనరల్ మేనేజర్లు సూచించిన వాటిపై ఆయన అప్పటికప్పుడు డైరెక్టర్లతో చర్చించి ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు (ఈ అండ్ ఎం.), జి.వెంకటేశ్వర్ రెడ్డి (పిపి అండ్ పా), జనరల్ మేనేజర్ కో–ఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని, జి.ఎం. (సి.పి.పి.) జక్కం రమేష్, వివిధ ఏరియాల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల కార్పొరేట్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

## హైడ్రాకు త్వరలో చట్ట బద్ధత

(మొదటి పేజీ తరువాయి)

జీవో 99 ద్వారా జులై 19న హైడ్రా ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యనిర్వాహక తీర్మానంతోనే సంస్థ ఏర్పాటు జరిగిందని పేర్కొన్నారు. హైడ్రా చట్టబద్ధతపై ప్రభుత్వం పని చేస్తున్నదని, వచ్చే నెల రోజుల్లోగా అందుకు సంబంధించి పూర్తి విధివిధానాతో ఆర్డినెన్స్ విడుదల చేస్తారని తెలిపారు. హైడ్రాకు త్వరలోనే విశేష అధికారాలతో పాటు ఆరు వారాల తరువాత అసెంబ్లీ 'హైడ్రా' బిల్లు రాబోతోందని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాల విషయంలో మున్సిపాలిటీలు, నీటి పారుదల, రెవెన్యూ శాఖలకు హైడ్రా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. గ్రే హౌండ్స్, టాస్క్‌ఫోర్స్ తరహాలో తాము పని చేస్తామని వెల్లడించారు. చెరువుల పరిరక్షణ ధ్యేయంతోనే తమ పని విధానం ఉంటుందని ఆయన వెల్లడించారు.. కొత్తగా ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసేవారు డాక్యుమెంట్ లు పూర్తిగా పరిశీలించుకోవాలని కోరారు.. అనుమానాలు ఉంటే సంబంధిత కార్యాలయాంలో వివరాలు తెలుసుకోవాలన్నారు.



## బాలాపూర్ గణేశుడికి డీజీపీ ప్రత్యేక పూజలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ గణేశుని వద్ద తెలంగాణ రాష్ట్ర డీజీపీ డా.జితేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ కి చెందిన పలు ఏసీపీలు, డీసీపీలతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## కూన వెంకటేష్ గౌడ్ కన్నుమూత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**


తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కూన వెంకటేష్ గౌడ్(67) శుక్రవారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. గతంలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా, సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల నుంచి టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడిగా పని చేశారు. ఆ తరువాత ఆయన బీఆర్ఎస్ లో చేరారు. ఇటీవల తిరిగి టీడీపీలోకి వచ్చారు.

## లక్ష్మారెడ్డికి కేటీఆర్ పరామర్శ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి ని కేటీఆర్ పరామర్శించారు. నాగర్ కర్నూల్ జిల్లా, తిమ్మాజీపేట మండలం, ఆవంచ గ్రామంలోని లక్ష్మారెడ్డి ఇంటికి వెళ్లి లక్ష్మారెడ్డి సతీమణి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. లక్ష్మారెడ్డి పిల్లలతో మాట్లాడుతూ తల్లి లేని లోటు తీర్చలేనిదన్నారు. ఈ కష్ట సమయంలో మనో స్థైర్యాన్ని కోల్పోవద్దని లక్ష్మారెడ్డి కి సూచించారు. కేటీఆర్ తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి ని ఓదార్చి ధైర్యం చెప్పారు.

# మదర్ డెయిరీ చైర్మెన్‌గా మధుసూదన్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సమితి నార్ముల్ మదర్ డెయిరీ నూతన చైర్మెన్‌గా(ఆలేరు) నియోజకవర్గానికి చెందిన గుడిపాటి మధుసూదన్ రెడ్డి ఎన్నికయ్యారు. శనివారం హయత్ నగర్‌లో ఉన్న మదర్ డెయిరీ కార్యాలయంలో 15మంది సభ్యులు కలిసి నూతన చైర్మెన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా మదర్ డెయిరీ చైర్మెన్, డైరెక్టర్లు పని చేయాలని అన్నారు. పార్టీల కతీతంగా మదర్ డెయిరీని బాగుచేసుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే రూ.4ల బోనస్ ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నూతన చైర్మెన్ కు పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.

బీఆర్ఎస్ పాలన మొత్తం స్కాముల మాయమని ప్రాజెక్టులు, గొర్రెలు, బర్రెలు అన్నింట్లో మోసాలేనని విమర్శించారు. హరీశ్‌రావు బినామీ పేరుతో చేసిన మోసలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. అందులో పాల విక్రయాలు కూడా ఉన్నాయని ఆరోపించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ విఫ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, చైర్మెన్ శ్రీకర్ రెడ్డి, డైరెక్టర్ లు గొల్లపల్లి రాంరెడ్డి, కల్లేపల్లి శ్రీశైలం, పాండు, నరేందర్ రెడ్డి, జంగయ్య, నర్సింహా రెడ్డి, నర్సింహులు, మాజీ చైర్మెన్లు గుత్తా జితేందర్ రెడ్డి, గంగుల కృష్ణా రెడ్డి, ఆలేరు మార్కెట్ చైర్మెన్ చైతన్య రెడ్డి, నాయకులు మోత్కుపల్లి ప్రవీణ్, సిల్వేరు బాలరాజు, నామిల మహేందర్ గౌడ్, సురేందర్ రెడ్డి, శంకర్ నాయక్, రాజు, రాంజీ నాయక్, విఠల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# విష జ్వరంతో 13 ఏండ్ల బాలిక మృతి

- ఇటీవల కరాటేలో ఎల్లో బెల్ట్ సాధించిన విద్యార్థిని
- కుటుంబంలో, గ్రామంలో తీవ్ర విషాదఛాయలు



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన 13 సంవత్సరాల బాలిక విష జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుస్నాబాద్ కు చెందిన మైదం శెట్టి మల్లికార్జున్ అనే అల్మాస్పూర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కుటుంబంతో ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కూతుర్లు అందులో పెద్ద కూతురు హాసిని నక్షత్ర(13) చిన్న కూతురు సిరి(7) ఉన్నారు. ఇందులో పెద్ద కూతురు హాసిని నక్షత్ర తీవ్ర జ్వరంతో స్థానిక ఓ ఆర్ ఎంపీ వైద్యుని వద్ద ప్రథమ చికిత్స చేయించుకుంది. జ్వరం నయం కాకపోగా తీవ్ర అస్వస్థకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు తొలత సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు ఈమె కండిషన్ చూసి మెరుగైన వైద్యానికి హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌లోని రెయిన్‌బో అనే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఎలాగైనా సరే తన కూతుర్ని బతికించాలని తల్లిదండ్రులు వైద్యులను ప్రాధేయపడ్డారు. 24 గంటల వరకు తామేం చెప్పలేమని వైద్యులుచెప్పడంతో ఏ క్షణం ఏం జరుగుతుందోనాని బిక్కుబిక్కుమంటూ ఆస్పత్రి ముందు రోధిస్తూ తల్లిదండ్రులు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం బాలిక హాసిని మృతి చెందిందని వైద్యులు తెలపడంతో గుండెలు పగిలేలా ఏడ్చారు. హాసిని స్థానిక విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో కరాటే ఎల్లో బెల్ట్ సాధించి, పాఠశాలలో జరిగే ప్రతి కల్చర్ ప్రోగ్రాం లో ముందుండి అందరి నోటా శభాష్ అనిపించుకున్నది. శనివారం సోషల్ మీడియాలో బాలిక మృతి చెందిన ఫోటోను చూసి స్థానికులు కంటతడి పెట్టారు. బాలిక మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి ఆమె స్వగ్రామమైన హుస్నాబాద్ కు తరలించి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**బలగం టీవీ , గంభీరావుపేట :**

గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకాహారం తీసుకోవాలని,అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలనీ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . ఎనీమియా నిర్ధారణ పరీక్షల ప్రత్యేక శిబిరాలు శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కాగా, గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోఎనీమియా నిర్ధారణ పరీక్షల నిర్వహించగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేపడుతున్న తీరును పరిశీలించారు. ముందుగా పరీక్షల కోసం ఎందరు వచ్చారో ఆరా తీసి, వివరాలు నమోదు చేసిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేస్తుండగా పరిశీలించారు. లింగన్నపేట పీ హెచ్ సీ లో ఎందరికి పరీక్షలు చేశారో వైద్యుడిని అడిగి తెలుసుకున్నారు. 108 మందికి ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేశామని కలెక్టర్ దృష్టికి పీ హెచ్ సీ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తీసుకెళ్లారు. పీ హెచ్ సీ ఆవరణ, ల్యాబ్, మందులగది, ఇన్ పేషెంట్ గదులను, అలాగే డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా పరిశీలించారు. ముగ్గురికి పరీక్షలు చేయగా అందరికీ నెగిటివ్ వచ్చినట్లు వైద్యులు తెలిపారు.

పీహెచ్‌సీ ఆవరణను గ్రామపంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించుకోవాలని వైద్యుడికి సూచించారు.అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు మీ మీ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతినెల పోషకాహారాన్ని తీసుకోవాలని,రక్త శాతం తక్కువ ఉన్న వారు మందులు, పండ్లు, డ్రైఫ్రూట్ తీసుకోవాలని అన్నారు. సీజనల్



వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో దవాఖానకు వస్తున్న అందరికీ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని అన్నారు . డెంగ్యూ నిర్ధారణ కిట్లు ఎన్ని ఉన్నాయో ఆరా తీశారు. ఏమైనా మందులు, నిర్ధారణ పరీక్షల కిట్లు అవసరం ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమం లో వైద్య సిబ్బంది అంగన్వాడి సిబ్బంది ఉన్నారు.

**తాత్కాలిక రోడ్డు ను వెంటనే నిర్మించండి...**

సిద్దిపేట- కామారెడ్డి ప్రధాన రహదారి మార్గం లోని లింగన్నపేట-గంభీరావుపేట మధ్యలో మానేరుపై నిర్మిస్తున్న హై లెవెల్ వంతెన వద్ద తాత్కాలిక రోడ్డు పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్డు కొట్టుకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, గంభీరావుపేట మండల కేంద్రానికి రావాలంటే 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించి రావాల్సి వస్తుందని స్థానిక ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజలకు వాహనదారులకు ఇబ్బంది కాకుండా తాత్కాలిక రోడ్డు పనులను వారం రోజుల్లో వెంటనే పూర్తి చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గంభీరావుపేటలోని చెరువును పరిశీలించారు.ఈ ఇక్కడ సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జ్ కే కే మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.



# స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్

**బలగం టీవీ , సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

# 16న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

**బలగం టీవీ, సిరిసిల్ల**

ఎంఎన్ జే క్యాన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఈ నెల 16న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు సిరిసిల్ల పట్టణంలోని బి వై నగర్ లో గల షాదీఖానా ఫంక్షన్ హాల్ లో నిర్వహించబడతాయని డీఎంహెచ్వో డాక్టర్ వసంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 16 న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, 25 సంవత్సరాలు పైబడిన మహిళలకు పరీక్షలు నిర్వహించబడునని, ఈ పరీక్షలలో బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ డిటెక్షన్ , మామోగ్రామ్ ,ఫైన్ నీడల్ ఆస్పిరేషన్ సైటోలజీ , సర్వైకల్ బయాప్సీ పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా వైద్యము కూడా అందించబడునని అన్నారు. కావున 25 సంవత్సరాల పైబడిన మహిళలలో తెల్లబట్ట, అధిక రక్తస్రావం, పొత్తికడుపులో నొప్పి, ఛాతీలో నొప్పి,చేతిలో గడ్డలు ఉన్నవారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొని, పరీక్షలు చేయించుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా లోని గల ప్రైవేట్ డాక్టర్లు, ఆర్ఎంపి, పీఎంపీ లు తమ వద్ద గుర్తించబడిన అనుమానిత పేషంట్లకు, 25 సంవత్సరాల పైబడిన మహిళలకు తెలియజేయాలని అన్నారు. సిరిసిల్ల ఐ ఎం ఏ విభాగం, ఐ ఎం ఏ మహిళా విభాగం,తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ విభాగం,జిజి హెచ్ సూపరింటెండెంట్, వేములవాడ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, లు తమ వద్దకు వచ్చే మహిళ పేషంట్లకు ఈ కార్యక్రమం గురించి తెలియజేసి తమ వంతు సహకారాన్ని అందించాలని తెలిపారు.

# రోడ్డుపై గుంతలు పూడ్చిన తంగళ్లపల్లి పోలీసులు



- ప్రమాదాల నివారణ కోసం సీసీతో చర్యలు

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రం నుండి జిల్లెల గ్రామ శివారు వరకు ఉన్న రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ గుంతలు ఏర్పడడంతో అట్టి గుంతలను గమనించకుండా వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. పరిస్థితినీ గమనించి ఇట్టి గుంతలు అన్నిటిని గుర్తించిన తంగళ్ళపల్లి ఎస్సై డి సుధాకర్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ మల్లేశం కానిస్టేబుల్ లు సంపత్, నరేందర్, రాజు హోంగార్డు శ్రీనివాస్ లు కలిసి రెడీ మిక్స్ సీసీని తెప్పించి రోడ్డు ప్రమాదాలు నివారించడం కోసం రహదారి పైన ఉన్న అన్ని గుంతలను పూడ్చారు.ప్రమాదాలు నివారణ కోసం పోలీసులు తీసుకున్న చర్యల వల్ల మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.









## బద్దెనపల్లి గురుకుల పాఠశాల

# నూతన పేరెంట్స్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

- చైర్మన్ గా లలితలి
- వైస్ చైర్మన్ గా కులేరి కిషోర్ కుమార్

**బలగం టీవీ,తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నూతన పేరెంట్స్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పేరెంట్స్ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా సుంకరి లక్ష్మణ్, చైర్మన్ గా లలిత, వైస్ చైర్మన్ గా కులేరి కిషోర్ కుమార్, సభ్యులుగా కే లావణ్య, గుగ్గిళ్ళ మమత, మాసం సరోజన, బంటు బాబు, నగరపు కనకయ్య, గుడిసె గంగయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏ సమస్యలు రాకుండా తమ ముందుండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు, విద్యార్థుల చదువు, గురుకుల పాఠశాలలోని వసతులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు,

# గణేష్ శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదు..



- గణేష్ నిమజ్జనోత్సవానికి పటిష్ట బందోబస్తు...
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

గణేష్ నిమజ్జనోత్సవానికి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని,గణేష్ శోభయత్రలో ఎట్టి పరిస్థితుల్లో డిజే లకు అనుమతి లేదు అని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని బివై నగర్, జేపీ నగర్, పద్మనగర్, సిక్ వాడ ,సంజీవయ్య నగర్ మొదలగు ప్రాంతల్లో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించి నిర్వహకులకు పలు సూచనలు చేసారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ భక్తులు, మండపాల నిర్వహకులు పోలీస్ వారి సూచనలు పాటిస్తూ నిర్దేశించిన సమయానికి నిమార్జనం పూర్తి చేయాలన్నారు. శోభాయాత్ర సమయంలో ఇతరుల మనోభావాలు దెబ్బతినెల పాటలు పెట్టిన, బాణాసంచా కలుస్తూ,మద్యపానం సేవించి శోభయత్రలో ఇతరులకు ఇబ్బందులు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవు అని అన్నారు.

జిల్లాలో మొత్తం 2200 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారని, సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 400, వేములవాడ పట్టణంలో 300, ఆయా మండలాలు, గ్రామాల్లో కలిపి మొత్తం దాదాపు 2200 ఏర్పాటు చేశారు అని అన్నారు.మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిర్ణీత సమయానికి విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని, వేడుకలు ఏలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా శాంతియుత వాతావరణంలో శోభయాత్ర సాగేలా పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమం లో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ కృష్ణ, మొగిలి ,సిబ్బంది ఉన్నారు.

# 170 కేజీల గంజాయి పట్టివేత



**బలగం టీవీ,పెద్ద అంబర్‌పేట**

పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద అనుమానస్పదంగా కనిపించిన ఓ వాహనంలో 170కేజీల గంజాయిని హయత్ నగర్ ఎక్సైజ్, టాస్కోఫర్స్, ఎన్ ఫోర్స్ మెంట్ శాఖల అధికారులు సంయుక్తంగా కలిసి పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు నిందితుల కదలికలను చాలా రోజులుగా గమనిస్తూ ఉన్నామన్నారు. పక్కా సమాచారంతో 170 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ముఠాలో ఎనిమిది మంది నిందితులు ఉన్నారని ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్ ఇస్మాయిల్ తురుకి, మహారాష్ట్ర పూణే ఇందాపూర్ చెందిన మహమ్మద్ ఆసిస్ రాజన్, పోనీ హిందీ ఇందాపూర్ చెందిన శైలేంద్ర కారత్ ఇలియాస్ బంటి, సోలాపూర్ జిల్లా కర్మాన తాలూకా చికాతన్ గ్రామానికి చెందిన జీవన్ నానా నికిత్, ఇందాపూర్ కు చెందిన కేవల్ వినయ్ ముకురే, ఒడిస్సా మల్కాన్ గిరి లక్ష్మీనారాయణ భారీఖ్, మల్కాన్ గిరి జిల్లా మతిని గ్రామానికి చెందిన ధర్మరాజు దొర, అమర్ కలిసి గంజాయి రవాణా చేస్తున్నారు. పట్టుబడ్డ వ్యాన్‌లో గంజాయి సరఫరా చేయడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారన్నారు. గంజాయి తీసుకు వెళుతున్న వాహనానికి ముందు మరొక వాహనంతో ఎస్కార్ట్‌గా వచ్చారన్నారు. మల్కాన్ గిరి ప్రాంతంలో ఈ గంజాయిని ప్యాక్ చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారన్నారు. ఈ ముఠాలో ఇస్మాయిల్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడు ఉన్నాడన్నారు. ప్రోక్లైన్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఇస్మాయిల్ తన పనిలో భాగంగా రాయపూర్‌లో పనిచేస్తున్న క్రమంలో సంతోష్ పరిచయం అయిందని, అతని ద్వారా గంజాయి సరిఫరాలోకి ఇస్మాయిల్ వచ్చాడని తెలిపారు. ఇస్మాయిల్ మహారాష్ట్రలో ఉండే సప్లయర్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని మహారాష్ట్రకు గంజాయి సప్లై చేస్తున్నాడన్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.34 లక్షలు ఉంటుందన్నారు. ఇస్మాయిల్‌పై గతంలో మహారాష్ట్రలో కేసు నమోదయిందని. నాలుగు సంవత్సరాల జైలు శిక్ష కూడా అనుభవించాడన్నారు. ఈ కేసులో నిందితుల నేర చరిత్రను బట్టి పిడీ యాక్ట్ పెడతామని ఖరేషి వెల్లడించారు. హైదరాబాద్ పెద్ద అంబర్ పేట్ ప్రాంతంలో ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు తరలి వెళ్తున్నటువంటి గంజాయి వాహనాన్ని స్టేట్ టాస్క్ ఫోర్స్ బీ టీం తుల శ్రీనివాసరావు బృందం పట్టుకున్నారని వెల్లడించారు.

# పాకిస్థాన్‌పై భారత్ విజయం



- 2-1 గోల్స్ తేడాతో భారత్ విజయం

**బలగం టీవి, బీజింగ్**

ఏషియన్ హాకీ చాంపియన్‌షిప్‌లో భారత్ జోరు కొనసాగిస్తోంది. శనివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 2-1 గోల్స్ తేడాతో భారత్ విజయం సాధించింది. ఏడో నిమిషంలో పాక్ ప్లేయర్ అహ్మద్ నదీమ్ గోల్ చేశాడు. అయితే ఆ తర్వాత హర్మన్‌ప్రీత్ సింగ్.. రెండు గోల్స్ చేసి ఇండియా జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. ఏషియన్ టోర్నీలో ఇప్పటికే భారత జట్టు సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే.

ఆట 13వ నిమిషంలో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తన డ్రాగ్‌ఫ్లిక్‌తో తొలి గోల్ చేశాడు. మళ్లీ 19వ నిమిషంలో మరో పెనాల్టీ కార్నర్ ను డ్రాగ్‌ఫ్లిక్‌తో రెండో గోల్ చేశాడు. రెండు గోల్స్‌తో టీమిండియా లీడింగ్‌లో ఉన్నా.. పాకిస్థాన్ ఆద్యంతం విరోచితంగా పోరాడింది. అయితే ఓ దశలో పాక్ ప్లేయర్ అష్రఫ్ రాణా దురుసుగా ప్రవర్తించాడు. ప్రవర్తన సరిగాలేకపోవడంతో.. టీవీ అంపైర్ అతనికి ఎల్లో కార్డు జారీ చేశాడు. చివరలో రెండు జట్లు కేవలం పది మంది ఆటగాళ్లతో ఆడారు. ఇక ఈ మ్యాచ్‌లో ఓడినా పాకిస్థాన్ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది.

భారత్, పాకిస్థాన్‌తో పాటు కొరియా సెమీస్ బెర్త్ దక్కించుకోగా.. మరో బెర్త్ కోసం మలేసియా, చైనా మధ్య పోటీ నెలకొంది. జపాన్ తమ తదుపరి మ్యాచ్‌లో విజయం సాధిస్తే మలేసియా ముందడుగు వేస్తోంది. లేదంటే చైనాకు అవకాశం దక్కుతుంది

# తిలక్‌వర్మ సెంచరీ



**బలగం టీవి, అనంతపురం**

దులీప్ ట్రోఫీలో టీమిండియా యువ బ్యాటర్, హైదరాబాద్ స్టార్ తిలక్ వర్మ శతకం సాధించాడు. ఈ టోర్నీలో మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని ఇండియా-ఏకు ప్రాతినిధ్యం వహిస్తున్న తిలక్ వర్మ.. ఇండియా డీతో జరుగుతున్న మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో 177 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 96 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన తిలక్ వర్మ.. మరో 81 బంతుల్లో శతకాన్ని అందుకున్నాడు. తిలక్ వర్మకు ఇది ఐదో ఫస్ట్ క్లాస్ సెంచరీ.

అనంతపురం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మతో పాటు ఓపెనర్ ప్రథమ్ సింగ్(122)కూడా శతకం సాధించడంతో ఇండియా-ఏ భారీ స్కోరు సాధించింది. 98 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 380 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తిలక్ వర్మతో(111 నాటౌట్) పాటు శశ్వాత్ రావత్(64 నాటౌట్) రాణించాడు. దాంతో 498 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇండియా డీ ముందు ఉంచింది.

లక్ష్య చేధనలో ఇండియా డీ 19 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టానికి 61 పరుగులు చేసింది. గెలవాలంటే ఇంకా 426 పరుగులు చేయాలి. క్రీజులో యశ్ దూబే 15 పరుగులతో, రికీ బుయ్ 44 పరుగులతో ఉన్నారు.

మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇండియా-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు ఆలౌటైంది. షామ్స్ ములాని(89), తనుష్ కొటియాన్(53)లు హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. ఇండియా డీ బౌలర్లలో హర్షిత్ రాణా(4/51) నాలుగు వికెట్లు తీయగా.. కావేరప్ప, అర్ష్‌దీప్ సింగ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. సరాన్ష్ జైన్, సౌరభ్ కుమార్ తలో వికెట్ తీసారు. అనంతరం ఇండియా-డీ 183 పరుగులకు కుప్పకూలింది. దేవదత్ పడిక్కల్(124 బంతుల్లో 15 ఫోర్లతో 92) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. ఇండియా-ఏ బౌలర్లలో ఖలీల్ అహ్మద్(3/39), ఆఖిబ్ ఖాన్(3/41) మూడేసి వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, తనుష్ కోటియన్, షామ్స్ ములాని తలో వికెట్ తీసారు. దాంతో ఇండియా-ఏకు 107 పరుగుల తొలి ఇన్నింగ్స్ భారీ ఆధిక్యం లభించింది.

# ఈశ్వరన్ ఒంటరి పోరాటం



ఈశ్వరన్

**బలగం టీవి, అనంతపురం**

ఈశ్వరన్(143 బ్యాటింగ్) సెంచరీతో ఒంటరి పోరాటం చేస్తుండడంతో దులీప్ ట్రోఫీలోఇండియా సీ, ఇండియా బీ మధ్య జరుగుతున్న మ్యాచ్ ఆసక్తికరంగా మారింది.

ఇండియా సీ బౌలర్ అన్షుల్ కంబోజ్ ధాటికి ఇండియా-బీ 194 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. అయితే కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(143 బ్యాటింగ్) సెంచరీతో ఒంటరి పోరాటం చేయడంతో ఇండియా బీ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. క్రీజులు అభిమన్యు ఈశ్వరన్‌తో పాటు రాహుల్ చాహర్ (18 బ్యాటింగ్) ఉన్నాడు. అంతకుముందు ఇండియా సీ 525 పరుగులకు ఆలౌటైంది.

ముంబై ఇండియన్స్ యువ ఆల్‌రౌండర్, హర్యానా క్రికెటర్ అన్షుల్ కంబోజ్ బ్యాటింగ్‌లో 38 పరుగులే చేసినా.. బౌలింగ్‌లో మాత్రం నిప్పులు చెరిగాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోనే తొలి సారి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. బౌలింగ్‌కు ఏమాత్రం అనుకూలం లేని ఫ్లాట్ వికెట్‌పై తొలి ఇన్నింగ్స్‌లో ఐదు కీలక వికెట్లు తీసాడు. ఇండియా బీ ప్రధాన బ్యాటర్లు నారయణ జగదీషన్(70), సెంచరీ హీరో ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్(16), రింకూ సింగ్(6), తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి(2)లను పెవిలియన్ చేర్చాడు. నితీష్ కుమార్ రెడ్డిని క్లీన్ బౌల్డ్ చేసి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. అన్షుల్ కంబోజ్ ధాటికి ఇండియా-బీ 194 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది.



అన్షుల్

# రీ రిలీజ్ కానున్న 'బొమ్మరిల్లు'




**బలగం టీవి, హైదరాబాద్**

2006లో విడుదలైన బొమ్మరిల్లు సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. తాజాగా ఈ సినిమాను రీ రిలీజ్ చేయనున్నట్లు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ప్రకటించింది.

టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు కెరీర్‌లో మర్చిపోలేని చిత్రాలలో బొమ్మరిల్లు ఒకటి. ఆయన సొంత బ్యానర్ అయిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై రూపొందిన ఈ చిత్రంలో సిద్దార్థ్, జెనీలియా జంటగా నటిం చగా ఈ సినిమాకు భాస్కర్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రం యువతకు బాగా కనెక్ట్ అయింది. అప్పట్లో ఈ సినిమా థియేటర్లో 100 రోజులు ఆడింది. ఇక బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ వర్షం కురిసింది. ఈ సినిమాతోనే దర్శకుడు భాస్కర్‌కు 'బొమ్మరిల్లు' ఇంటిపేరుగా మారింది.

అయితే ఈ సినిమాను సెప్టెంబర్ 21న రీ రిలీజ్ చేయబోతున్నట్లు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఎప్పటికి మరచిపోలేని సినిమా.. ఆ ఆనందాన్ని పంచడానికి వచేస్తున్నాం కుదిరితే కప్ కాఫీ సెప్టెంబర్ 21కు మళ్ళి థియేటర్స్ లో అంటూ పోస్ట్ చేసింది.




# సముద్రంలో 'దేవర' కటౌట్

**బలగం టీవి, ముంబై**

యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా సందడి సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. నందమూరి అభిమానులతో పాటు టాలీవుడ్ ప్రేక్షకులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రం విడుదల దగ్గరపడటంతో వరుస ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లో జెట్ వేగంతో ప్రమోషన్స్‌లో దూసుకుపోతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం అరుదైన రికార్డును క్రియేట్ చేసింది. ఫస్ట్ టైం ఒక సినిమా కటౌట్‌ను సముద్రంలో ఏర్పాటు చేశారు. ముంబైలోని దాదర్ చౌపట్టి దగ్గర ఈ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనంకు వచ్చే ప్రజలకు ఇది కనిపించనుంది. కాగా.. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోతో పాటు ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు.

## కేబీసీలో పవన్ కల్యాణ్‌పై ప్రశ్న

**బలగం టీవి, ముంబై**

అత్యంత ప్రజాదరణ కలిగిన షో కౌన్ బనేగా కరోడ్‌పతి. దీనికి బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం 16వ సీజన్ కొనసాగుతున్నది. ఇందులో టాలీవుడ్ నటుడు పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ పై ప్రశ్న అడిగారు. దాంతో ప్రస్తుతం ఈ వీడియో వైరలవుతోంది.

శుక్రవారం ఎపిసోడ్‌లో వృద్ధ దంపతులు హాట్‌సీట్‌లోకి వచ్చారు. రూ.80 వేల ప్రశ్న వరకు విజయవంతంగా సమాధానాలు చెప్పారు. అనంతరం పవన్‌కు సంబంధించిన ప్రశ్న అడిగారు. '2024 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నటుడు ఎవరు?' అని అడిగారు. పవన్ కల్యాణ్, చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ అనే ఆప్షన్లను అమితాబ్ వారికి ఇచ్చారు. కంటెస్టెంట్‌లు ఈ ప్రశ్నకు 'ఆడియన్స్ పోల్' ఆప్షన్ తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆడియన్స్‌లో 50 శాతం మందికి పైగా పవన్ కల్యాణ్ అని చెప్పారు. దాంతో వారు పవన్ పేరు చెప్పి లాక్ చేశారు. సరైన సమాధానం కావడంతో కంటెస్టెంట్ రూ.1.60లక్షలు గెలుచుకొని తర్వాత ప్రశ్నకు వెళ్లారు.